
# నివాళి



బెండపూడి రమేష్‌బాబు

సావిత్రమ్మగారు చనిపోయారనే వార్త దావా లనంలా వ్యాపించింది. ప్రముఖ సాహితీవేత్త రామారావుకు సతీవియోగమంటూ పేపర్లు బాక్సులు కట్టి మరీ ప్రచురించాయి.

ఆమె అంత ప్రముఖ వ్యక్తి కాకపోయినా రామారావు భార్య కావడంతో ఆ వార్తకంత ప్రాముఖ్యత వచ్చింది.

సాహితీ వినీలాకాశంలో ఉజ్వలంగా ప్రకాశిస్తున్న తార అతను. ఎందరో పాఠకుల ఆరాధ్య దైవం.

సావిత్రమ్మ చనిపోయిన విషయం తెలుసుకుని పరామర్శించడానికెందరో ప్రముఖులు వచ్చారు.

అభిమానుల్తో ఆ ప్రదేశం కిటకిటలాడుతోంది.

అప్పటికప్పుడే ఓ సంతాపసభ ఏర్పాటు చేసారు.

సాహితీరంగంలో ఆయన చేస్తున్న సేవ గురించి, భార్యపై ఆయనకు గల ప్రేమ గురించి, వారి అన్యోన్యదాంపత్యం గురించీ వక్తలు పోటీపడి మరీ పొగిడేస్తున్నారు.

యిదంతా వింటున్న పద్మ తన తల్లి చనిపోలేదని, ఆమె చావుకు తన తండ్రే కారణం అనీ అరిచి, ఎలుగెత్తి చాటాలనుకొంది.

దుఃఖంతో పూడుకుపోయిన ఆమె గొంతు పెగలడంలేదు.

ఎవరో ప్రజాప్రతినిధితో మాట్లాడుతున్న తండ్రివైపు చూస్తూ - 'తండ్రిగా మిమ్మల్ని ప్రేమించలేను డాడీ... అలాగని ద్వేషించనూ లేను' అనుకొంది మనసులో కసిగా.

జీవనపోరాటంలో అలసిపోయి ప్రశాంతంగా నిద్రిస్తున్నట్లున్న తల్లి మొహంపై వాలుతున్న ఈగల్ని చేత్తో తోలసాగింది.

తల వద్ద ఉంచిన దీపం నిశ్చలంగా వెలుగుతోంది.

అంతిమ సంస్కారానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

కళ్లంట నీరు ధారాపాతంగా వర్షిస్తూంటే గతం గుర్తుకురాసాగింది.

ఉన్నత చదువులు చదివి కూడా 'ఉద్యోగం పురుష లక్షణమ'ని ఎంత చెప్పినా తాతగారి నుంచి వారసత్వంగా వచ్చిన పొలం సాగుచేసుకుంటూ నాగులవరం గ్రామంలో స్థిరపడ్డాడు తన తండ్రి. ఆస్తిపాస్తులున్నాయనే అమ్మనతనికిచ్చి చేసారని అందరూ అనుకునేవారు. కోటి ఆశల్తో అతని జీవితంలోకి అడుగుపెట్టింది.

అన్నింటికన్నా తానెంతో అభిమానించే రచయితనే పెళ్లి చేసుకున్నందుకు మురిసిపోయేది. పగలంతా వ్యవసాయ పన్లతో క్షణం తీరిక లేకుండా గడిపేవాడు. రాత్రివేళల్లో రచనా వ్యాసంగాల్తో కాలక్షేపం -

రిఫరెన్స్ కోసం పుస్తకాలు చూసిపెట్టడం, రాసుకొన్న నోట్సుకు ఫెయిర్ రాయడం, అధ్యయనం పూర్తయ్యేదాకా కనిపెట్టుకుని వుండడం ఆమె జీవితంలో ఒక భాగం అయిపోయాయి.

అతని కోసం వచ్చేవారికి యంత్రంలా గొడ్డుచాకిరీ చెయ్యడంతో విసుగొచ్చేది అమ్మకు.

అతనెదగదల్చుకొన్న సాహితీ ప్రపంచానికి ఆమె ఓమెట్టులా తయారయ్యింది.

ఓ రోజు రాత్రి -

"యింత పొద్దుపోయిందాకా మేల్కొంటే మీ ఆరోగ్యం ఏమైపోతుందో ఆలోచించారా?"

అంది సావిత్రమ్మ భర్తనుద్దేశించి.

"బోలెడు రాసుకోవాల్సింది ఉంది, నిద్ర పోతే కుదర్దు" అన్నాడు పుస్తకంలో ఏవో లైన్లు అండర్‌లైన్ చేస్తూ.

"రాసుకోవద్దని నా భావన కాదండీ... త్వర గా పడుకోకపోతే మీ ఆరోగ్యం ఏమైపోతుందో అనేదే నా బెంగ" అంది.


"నా ఆరోగ్యానికేం? నిక్షేపంలా ఉంది. కావాలంటే నీవెళ్లి పడుకో" అన్నాడు తలెత్తి భార్య మొహంలోకి చూస్తూ.

"నిద్ర రావడం లేదు".


"దానికి నన్నేం చెయ్యమంటావు... పని మానుకుని జోల పాడనా? లేకపోతే నీకెదురుగా కూర్చుని సొల్లు కబుర్లాడనా? నీ కంటే ఏ పనీ పాటా లేదు... యిలా నా ఎదురుగా కూర్చొని డిస్టర్బ్ చేయడం తప్పు..." అన్నాడు విసుగ్గా.

ఆ మాటల్లో హేళన అర్థమవుతూనే ఉంది. తన మీదున్న తేలిక భావానికి బాధేసింది. తననో తెలివి తక్కువ దద్దమ్మగా జమచేసి మాట్లాడడంతో దిగులేసింది. భార్యగా అతనా రోగ్యం గురించి బాధపడడం తప్పా? తన ఉనికికి యిదేనా అతనిచ్చే విలువా, గౌరవం? తన పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని తెలుస్తోంది. అతని ఆనందం కోసం ఎన్నో రకాలుగా జీవితంలో రాజీపడడం నేర్చుకుంది.

పెళ్లికి ముందు తను కన్న కలలు ఒక్కొక్కటే తన కళ్లముందు కరిగిపోతూంటే ఏదో తెలియని



ప్రజాసాహితి వేదిక, విజయవాడ ప్రతి నెల 3వ ఆదివారం నిర్వహించే సాహిత్య సభలో భాగంగా 19-4-09 న చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో చైతన్యప్రకాశ్ కవితాసంపుటి "మూయని దర్వాజా" ఆవిష్కరించి, ప్రసంగిస్తున్న ప్రముఖ కవి, కథకులు డా॥ పాపినేని శివశంకర్. ఎడమ నుంచి వరుసలో ప్రముఖ రచయిత్రి పి. సత్యవతి, వేదిక కన్వీనర్, కవి కె. ఆంజనేయకుమార్, కవి చైతన్యప్రకాశ్ ఉన్నారు.




అభద్రతా భావం తొంగిచూస్తోంది. అది ప్రేమో... బలహీనతో... అతన్ని ఎదిరించి మాట్లాడే సాహసం చెయ్యలేకపోతోంది.

సాహితీ ప్రపంచంలో అతని పరిధి విస్తరిస్తోంది. ప్రజల్లో గుర్తింపు, గౌరవం పెరగ సాగాయి.

పొలం వ్యవహారాల్లో సైతం తన భాగస్వామ్యం తగ్గించుకొని, ఆ బాధ్యతా అమ్మకే అప్పచెప్పాడు.

సన్నిహితులతో ప్రాచీనాంధ్ర వైభవం నుంచి వర్తమాన దుస్థితి వరకూ ఉద్దండుల కావ్యాలపై గంటల తరబడి సుదీర్ఘ చర్చలు జరిగేవి. అవి ఎంత పొద్దుపోయినా తెగేవి కావు.

యీలోగా వాళ్లకి కాఫీలు, టిఫిన్లూ అందిస్తూ సేవలు చేయలేక అమ్మ సతమతమైపోయేది.

యిదంతా గమనిస్తున్న తను ఆవేశంతో "నీవూ ఓ మనిషివే అన్న ఆలోచన ఏమైనా వుందామ్మా నాన్నగారికి?... యంత్రంలా ఎంత సేపని సపర్యలు చేస్తావు వాళ్లకి" అంటే...?

వూరుకో తల్లీ... నాన్నగారు వింటే బాధపడతారు" అంది లాలనగా.

"నాన్నగారింటే బాధపడతారంటున్నావు గాని, పన్లు చెయ్యలేక నువ్వెంత అవస్థ పడుతున్నావో నాన్నగారు ఆలోచిస్తున్నారా? ఎంత సేపూ సమాజంలో ఆయనకున్న స్టేటస్ గురించి, దాని కాపాడుకోవడం కోసం, ఇంకా పెంచుకోవడం కోసం ఉన్న తపన నీ గురించి ఉందా?"

"నా తల్లివి కదూ... వూరుకోమ్మా... ఎవరి హద్దుల్లో వాళ్లుంటే అనవసరపు వాదనలు రావు తల్లీ" ఎక్కడ ఈ మాటలు తండ్రి వింటాడో అనే భయం కళ్లల్లో స్పష్టంగా కనిపిస్తోంది అమ్మ మొహంలో. ఆ మాటల్లో నిరాశ. నిస్పృహ

కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. తను పడే కష్టాన్ని కూడా మనసు విప్పి చెప్పుకోలేని దుర్భర స్థితి... బహుశా మసకబారుతున్న మానవ సంబంధాలేమో...

వాదించి తల్లి మనసు నొప్పించడం ఇష్టం లేక తన గదిలోకి వెళ్లిపోయింది చదువుకోవడానికి.

తన డిగ్రీ ఫైనలియర్ ఎగ్జామ్స్ పూర్తయ్యాయి.

గుంటూరు సాహితీ సమాఖ్యవారు నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరై ఊరినుంచి అప్పుడే వచ్చిన తండ్రికి ఫ్రిజ్ డోర్ తీసి మంచి నీళ్లు అందించింది.

ఆ చల్లని నీళ్లు తాగి కాస్త సేదతీరాడు. పడక్కుర్చీలో రిలాక్స్‌డ్‌గా నడుంవాల్చి "పద్మకి ఓ సంబంధం చూసాను" అన్నాడు భార్యనుద్దేశించి.

ఆమె మౌనంగా వినసాగింది. అతడు చెప్పుకుపోతున్నాడు...


అబ్బాయికి గవర్నమెంట్ జాబ్ అని, చాలా బుద్ధిమంతుడని, కట్నకానుకలపై వాళ్లకంత ఆసక్తి లేదని, తమతో సంబంధం కలుపుకోవడమే గొప్ప అదృష్టంగా భావిస్తున్నారనీ చెప్పాడు.

అతను చెప్పినదంతా విని, మౌనంగా తలూపింది సరే అన్నట్లు.

వివాహమై తను అత్తారింటికి వెళ్తూంటే అమ్మ కళ్లల్లో కనిపించిన 'తన కష్టసుఖాలు పంచుకునే ఓ ఆత్మీయురాలు దూరమైపోతున్నద'న్న భావన యిప్పటికీ మర్చిపోలేదు.

అమ్మకి ఫోన్‌చేసి ప్రతిరోజూ మాట్లాడుతూనే ఉన్నా.

చుట్టూ గీసుకున్న పరిధి దాటి రాలేని నాన్న, ఆ చట్రంలో ఇమడలేని అమ్మ... ఫోన్లో



కాకినాడ ట్రెజరీ కాలనీలోని అంజనీ కుటీర్‌లో శ్రీ విరోధి ఉగాది రోజున ఎం.వి.ఎస్. ప్రసాద్ కథాసంకలనం "దేముడు" ఆవిష్కరణ. చిత్రంలో గ్రంథ ఆవిష్కరణకర్త డాక్టర్ విజయలక్ష్మి, రచయిత, వారి కుటుంబసభ్యులు.

ఈ చర్చలే ఎక్కువ సాగేవి. పొడిపొడి మాటలే తప్ప ఆప్యాయతల్లేని జీవితాలు... గొలుసుకట్టు తెగిపోకుండా అప్పుడప్పుడూ వేసుకునే ముళ్లు... పేరుకోసం ఒకరు, ప్రేమ కోసం ఒకరు. ఎవరి దారి వారిదే. అమ్మను ఏదో తెలియని వంటరితనం వేధిస్తోంది.

నా దగ్గరకి వచ్చేయమని చెప్పా... యీ వయస్సులో మీ నాన్నని వొంటరివాడ్ని చేసి ఎలా వచ్చేదిరా? అంది.

నాన్నలో మార్పు రాదు. క్షణం తీరిక లేకుండా తిలక్ సౌందర్యస్పర్శ చేస్తూనే ఉన్నాడు. కుందుర్తి సంస్కృతమూలాలు స్పృశిస్తూనే ఉన్నాడు. ఆంధ్రోద్యమంలో వికసించిన కవితా పుష్పాలు ఆఘ్రాణిస్తూనే ఉన్నాడు.

ఒంటరితనం తెచ్చిన ఆవేదనతో కృంగిన అమ్మ హృదయం ఆ దిగులుతో కృంగి ఒక్క పోటుతో ఆగిపోయింది.

"చివరిసారిగా అమ్మగారికి నమస్కారం చేస్తామ్మా" అన్న పంతులుగారి పిలుపుతో ఊహల్లోంచి బయటపడింది పద్మ. పసిపిల్లలా తల్లి శవంపై పడి భోరుభోరున ఏడ్చింది.

ఆ దృశ్యం అక్కడ చేరిన వారి కంట కన్నీరు తెప్పించింది.

సావిత్రమ్మ అంత్యక్రియలు ముగిసాయి.

అందరూ ఊరెళ్లిపోయారు.

భార్యలేని వంటరితనం వెక్కిరిస్తోంది. బ్రతుకుబండి భారంగా దొర్లసాగింది.

ఏదో పనుండి ఆల్మారా సర్దుతూంటే ఓ కవర్ కనిపించింది. అది సావిత్రి పద్మకి రాసుకున్న ఉత్తరం.

ఏం రాసుకుందో అనుకుంటూ కవర్ విప్పి చదవసాగాడు. కళ్లు అక్షరాల వెంట పరిగెత్త సాగాయి...

తల్లీ... పద్మా...

మీ అమ్మ దీవెనలతో... క్షేమమని తలుస్తాను. యిక్కడ నా పరిస్థితి నీకు తెలియంది కాదు కదా? ఓ గొప్ప రచయితని పెళ్లాడానని ఆనందించానే కాని, పెళ్లికి ముందు కన్న కలలు అనుకున్నవి అనుకున్నట్లు అందుకోలేని దురదృష్టవంతురాలిని. మీ నాన్న స్వాంతనలో తీర్చుకొందామనుకున్న చిరు కోరికలు కూడా ఎండమావుల్లా మిగిలిపోయాయి తప్ప తీరేవి కాదు. బహుశా ఆయనలో పెరిగిపోయిన 'ఐడెంటిటీ క్రైసిస్' కాబోలు. అది తెచ్చిన పొగడ్తల 'యిగో' నేమో! పొగడ్తల సుడిగుండంలో చిక్కుకున్న మీ నాన్నగారు ప్రేమతీరాలు అందుకోవాలన్నా అందుకోలేరేమో... సాహిత్యమే సర్వస్వం అనుకున్నారేగాని తన సాన్నిహిత్యం కోరేవారి గురించి ఆలోచించే ఓపిక, తీరిక ఎక్కడివిరా ఆయనకి?

సాహిత్యాభిమానులు వుండరని కాదు... అదే పరమావధిగా బ్రతికే వాళ్లలో మీ నాన్నగారు తప్ప వేరెవరూ వుండరేమో...

ఆ తర్వాత ఉత్తరం అసంపూర్తిగా ఉంది. ఇంకేం రాయకుండా అలా ఎందుకు వదిలేసిందో రామారావుకి అర్థంకాలేదు.

కంట్లో సన్నటి కన్నీటిపొర అడ్డుపడి అక్షరాలు మసక మసగ్గా కనిపించసాగాయి.

మానసికంగా సావిత్రి అనుభవించిన వేదన తలుచుకుంటేనే నీరసం ఆవహించసాగింది. సాహితీ పిపాసతో తాను ఏం కోల్పోయాడో అనే భావన అతని మది తొలిచివేయసాగింది.

అప్పట్నుంచి ఏ పత్రికలోనూ అతని సాహిత్యం కనిపించలేదు. అదే తన భార్యకి నిజమైన 'నివాళి' అని అతని భావం కాబోలు. ●